క్లుప్తంగా

దైవక్షేత్రంలో మద్యం అమ్మకాలు

కొనకనమిట్ల: వెలుగొండస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం జరిగిన తిరునాళ్ల సందర్భంగా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరిగాయని భక్తుల నుంచి విమర్శలు వినిపించాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇష్టానుసారంగా స్టాల్స్ ఏర్పాటు చేసి మరీ అమ్మకాలు సాగించారు. తిరునాళ్ల కావటంతో ఎంత ధర అయినా పెట్టి మందు బాబులు కొనుగోలు చేస్తారని, ఒక్కో బాటిల్‌కు రూ.50 నుంచి 100 వరకు అదనంగా అమ్మకాలు చేశారని బహిరంగంగానే మందుబాబులు విమర్శించారు. అధికారులు కూడా చూసీచూడనట్లు ఉండటంతో విచ్చలవిడిగా తిరునాళ్లల్లో మద్యం అమ్మకాలు చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం అమ్మకుండా అధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయం తనిఖీ చేసిన ఎమ్మెల్యే


రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గణేష్ నగర్‌లోని 1,2 వ వార్డులకు సంబంధించిన గ్రామ సచివాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది సకాలంలో వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కమిషనర్ ఐ.శ్రీనివాసులు, తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఓటర్ కార్డులకు ఆధార్ తప్పనిసరి


మాట్లాడుతున్న వెలిగొండ ప్రాజెక్ట్ ఎస్‌డీసీ వెంకట శివరామిరెడ్డి

బేస్తవారిపేట: ప్రతి ఓటర్ కార్డుకు ఆధార్ నెంబర్‌ను లింక్ చేయాలని వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం వెంకట శివరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బేస్తవారిపేట మండలంలోని 55 పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితాలోని ప్రతి ఓటర్‌కు ఆధార్‌కార్డు నమోదు చేయాలన్నారు. ఫారమ్-6, 7, 8 చేర్పులు, తొలగింపులు, సవరణలు ఎప్పటికప్పుడు సకాలంలో విచారణ చేసి పూర్తి చేయాలని సూచించారు. 1200 ఓట్లు దాటితే కొత్త బూత్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. మండలంలోని 55 పోలింగ్ బూత్‌లలో 323 ఓటర్లకు ఆధార్ కార్డు జత చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర కుమార్, డీటీ సలీమ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రంగస్వామి ఆలయంలో బహిరంగ వేలం


బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఈవో నాగయ్య

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం లక్ష్మమ్మ వనంలోని కల్యాణ మండపంలో వివిధ షాపులకు వేలం నిర్వహించారు. శనివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య అధ్వర్యంలో వేలం నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునేందుకు రూ.16.25 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారని ఈవో తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి బీ నాగమల్లేశ్వరరాజు, అర్చకుడు అన్నవరం సత్యనారాయణచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వక.. పనులు జరగక!

- దూపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు సరిగా అందని సాగర్ నీరు
- అదనపు పనులు పూర్తి అయితే పట్టణ ప్రజలకు పుష్కలంగా నీరు
- బిల్లులు చెల్లించలేదని పనులను నిలిపేసిన కాంట్రాక్టర్
- కూటమి ప్రభుత్వంలో ముందుకు సాగని పనులు


మార్కాపురం పట్టణ వ్యూ


పైప్‌లైన్ నిర్మాణం ఇలా

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అలసత్వం కారణంగా మార్కాపురం పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో సాగర్ నీరు సరిగా అందకపోవడంతో తీవ్ర ఇబందులు పడుతున్నారు. ఇక పైప్‌లైన్ పగిలిందంటే మళ్లీ మూడు, నాలుగు రోజుల వరకు కూడా నీటి సరఫరా చేయడం లేదు. పట్టణ ప్రజలకు త్రిపురాంతకం మండలం దూపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుంచి సాగర్ నీరు సరఫరా చేస్తున్నారు. అయితే సాగర్ నుంచి ట్యాంక్‌కు నీటి పంపింగ్ కెపాసిటీ సరిపోకపోవడంతో నీరు సరిగా రావడం లేదు. ఇందుకు సాగర్ నుంచి ట్యాంక్‌కు రెండో పైప్‌లైన్ కోసం అదనంగా రూ. 22.40 కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపారు. వాటితో పాటు మూడు కిలో మీటర్ల మేర దూపాడు నుంచి కేశినేనిపల్లి వరకు సాగర్ పైప్‌లైన్ నిర్మాణం, అలాగే మార్కాపురం పట్టణంలో 25వ వార్డు నుంచి 32వ వార్డు వరకు నూతన సాగర్ పైప్‌లైన్ నిర్మాణం, దూపాడు నుంచి ఎస్ఎస్ ట్యాంక్ వరకు అదనపు పైపులైన్ నిర్మాణం ఉన్నాయి. ఇవి పూర్తయితే పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఎస్ఎస్ ట్యాంక్ కెపాసిటీ సుమారు 220 మిలియన్ లీటర్లు కాగా అదనపు పైప్‌లైన్ పూర్తి అయితే సుమారు 20 రోజుల్లో ట్యాంక్ నిండా నీటిని సరఫరా చేసుకోవచ్చు. ప్రస్తుతం లెక్కల ప్రకారం పట్టణ జనాభాకు రోజుకు సుమారు 80 వేల లీటర్ల నీరు అవసరం అని లెక్క గట్టారు.

సగం పనులు మాత్రమే చేసిన కాంట్రాక్టర్..

సాగర్ నీటి కష్టాలు తప్పాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అదనంగా సుమారు రూ.22.40 కోట్లతో రెండో పైప్‌లైన్, ఇతర పనులకు ప్రతిపాదనలు తయారు చేసి మున్సిపల్ అధికారులు పంపగా అనుమతులను మంజూరు చేసి నిధులు మంజూరు చేశారు. అయితే కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి మిగిలిన పనులకు నిధులు మంజూరు కాలేదని పనులు నిలిపివేశాడు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలు కావస్తున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తరువాతనే పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. సాగర్ కాలువకు నీరు వదిలితే సుమారు 20 రోజుల్లో ట్యాంక్ నిండుతుంది. కాని ఇప్పటి వరకు ట్యాంక్ నిండటానికి 60 రోజులు పడుతోందని సమాచారం. దూపాడు సాగర్ వాటర్‌కు ప్రతిపాదిత పనులు పూర్తి అయితే పట్టణ ప్రజలకు రోజు మార్చి రోజు నీరు అందించవచ్చని అధికారులు చెప్తున్నారు.

పైప్‌లైన్ పనులు ఇలా వేస్తున్నారు ..

పట్టణంలో మిగిలిపోయిన వార్డుల్లో పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.5.2 కోట్లు మంజూరు చేయగా 50 శాతం పనులకు ప్రభుత్వం రూ.2.5 కోట్లను విడుదల కాగా 50 శాతం పని చేశారు. అలాగే సుమారు మూడు కిలో మీటర్ల మేర దూపాడు నుంచి కేశినేనిపల్లి వరకు పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.4.8 కోట్లు మంజూరు చేయగా 40 శాతం పనులు జరగగా రూ. 2 కోట్లు చెల్లించారు. అయితే దూపాడు కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంక్ వరకు అదనపు పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.12.75 కోట్లు ప్రతిపాదించగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి కేవలం 25 శాతం పనులు జరగటంతో టెండర్ నిలిపివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ పనులకు ప్రభుత్వం నుంచి గ్యారెంటీ వస్తేనే పనులు ప్రారభిస్తామని కాంట్రాక్టర్ తెలపడంతో ఉన్నాతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ఈపనులు పూర్తి అయితే పట్టణ ప్రజలకు సాగర్ నీటిని రోజు మార్చి రోజు సరఫరా చేయవచ్చని అధికారులు చెప్తున్నారు.

> **సాగర్ కాల్వల నిర్మాణ పనులు పూర్తిచేయాలి..**
>
> 
>
> మార్కాపురం పట్టణంలో సాగర్ కాలువ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి. పనులు పూర్తికాకపోవడంతో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీని వలన ఐదురోజులకొకసారి తాగునీటి సరఫరా జరుగుతోంది. త్వరగా పూర్తయితే నీటి సమస్య తీరుతుంది. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలి.
>
> – సోమయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు


దూపాడుకు వచ్చే సాగర్ కాలువ


దూపాడు వద్ద ఉన్న ఎస్ఎస్ ట్యాంక్

వెలుగొండలో భక్తజన జాతర


స్వామి దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

కొనకనమిట్ల: నమో వేంకటేశాయా, గోవిందా..గోవిందా అంటూ భక్తులు పరవశించి పోయారు. శ్రీవారి బ్రహ్మోత్సవం వేళ శనివారం ప్రధాన తిరునాళ్ల కావడంతో వెలుగొండ క్షేత్రం భక్తులతో పులకించింది. గోవిందనామ స్మరణలతో వెలుగొండ ప్రాంతం మార్మోగింది. క్యూ లైన్‌లో భారీ సంఖ్యలో వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులు తలనీలాలు సమర్పించగా మహిళలు నైవేద్యాలతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కొండపైన పీఠమీద లక్ష్మమ్మ అమ్మవారికి, గంగాభవాని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లోభాగంగా శ్రీవారు పల్లకిలో అలంకరించిన గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, చెంచులక్ష్మి, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాలు ఆకట్టుకున్నాయి. ఉభయదాతలు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఉత్సవ సేవా కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగాయి. వేదపండితులు స్వామివారికి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం రథోత్సవం వైభవంగా జరుగుతుందని ఈవో తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పొదిలి సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్ఐ రాజ్‌కుమార్ పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

భక్తుల సందడి.. షాపుల వద్ద హడావుడి

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం వెలుగొండ క్షేత్రంలో నిర్వహించిన తిరునాళ్లలో సందడి నెలకొంది. జిల్లా నలుమూల నుంచి వేలాదిగా భక్తులు తరలి రావటంతో ఆలయ ప్రాంతం కిక్కిరిసింది. ఎగ్జిబిషన్, మిఠాయి కొట్లు, పలు రకాల షాపులు వద్ద ప్రజలు బారులు తీరి సందడి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పులిహోర, పరమాన్నం, మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలు దాతలు ఏర్పాటు చేశారు. యువత ఉత్సాహంగా తిరునాళ్లలో కేరింతలు కొడుతూ గడిపారు. శ్రీవారి ఆలయానికి తాడివారు గుర్రంపై ఊరేగుతూ కత్తులు, కటార్లతో తరలి వచ్చారు.


అలంకరణలో శ్రీవారు


కోలాటం ఆడుతున్న మహిళలు


ఆలయ వీధుల్లో నెలకొన్న హడావుడి

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి, కంభం రోడ్డులోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవ స్వామివారి, వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌లకు అభిషేకాలు, తోమాల సేవ చేశారు. భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించి విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పంచాయతీల్లో పరిశుభ్రత అవసరం


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

మార్కాపురం: గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలని డివిజనల్ పంచాయతీ అధికారి వై భాగ్యవతి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, గ్రీన్ అంబాసిడర్‌లకు మండలంలోని రాయవరం వద్ద ఉన్న ఎల్‌టీసీ ట్రైనింగ్ భవనంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్త వేరు చేయాలని, వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. ఉన్న వనరులతో పంచాయతీలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని కార్యదర్శులందరూ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న అంశాలను అమలు చేయాలన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి


సమావేశంలో పాల్గొన్న బహుజన రైతు సంఘం నాయకులు

మార్కాపురం: ప్రభుత్వ మిగులు భూములు అన్యాక్రాంతం కాకుండా నిరుపేదలకు పంచాలని బహుజన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలపాటి నాగయ్య కోరారు. శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు భూమి ఇవ్వడం ద్వారా ఆత్మగౌరవం పెరిగి సమానత్వం ఏర్పడుతుందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. జిల్లా బహుజన రైతు సంఘం అధ్యక్షుడిగా పెద్దారవీడుకు చెందిన న్యాయవాది వలపర్ల మోషే బాబును ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంకు మేనేజర్ వి శ్రీనివాసులు, జడ్డా లక్ష్మయ్య, కాకర్ల రాజయ్య, కె పిచ్చయ్య, అబ్రహాం, బెజవాడ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులతో నష్టం

గిద్దలూరు రూరల్: రైతులు పండించే పంటలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికంగా పురుగు మందులు వాడటం వల్ల ఆహార ధాన్యాలు, కూరగాయలతో పాటుగా భూమి కలుషితమవుతుందన్నారు. మానవాళి ఆరోగ్యం దెబ్బతినకుండా ప్రభుత్వం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ వెంకటేశ్వర్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో చిరుజల్లులు

గిద్దలూరు రూరల్: వేసవిలో శనివారం సాయంత్రం 5 గంటలకు చిరుజల్లులు కురవడంతో గిద్దలూరు పట్టణ ప్రజలు ఒకింత ఆనందం వ్యక్తం చేశారు. మండే వేసవిలో ఈ విధంగా వాతావరణలో ఒక్కసారిగా మార్పులు వచ్చి వర్షం పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. తేలికపాటి వర్షం కారణంగా సుగంధ పరిమళాలను మించిన మట్టివాసనతో ప్రజలో ఎంతో సంతోషించారు. వేసవి సమయంలో కొద్దిపాటి వర్షం ప్రజలకు ఆనందాన్ని మిగిల్చింది.

ఎస్సీ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

మార్కాపురం టౌన్: నియోజకవర్గంలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన 9 మంది ఎస్సీ లబ్ధిదారులకు పీఎం అజయ్ ఉన్నతి పథకం ద్వారా రూ.13 లక్షల చెక్కులను శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అందచేశారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, మార్కాపురం, తర్లుపాడు ఏపీఎంలు పిచ్చయ్య, రమేష్, కొనకనమిట్ల, పొదిలి సీసీలు సాయిలు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

కంభం: మట్కా ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై నరసింహారావు వివరాల మేరకు.. స్థానిక బస్టాండు సమీపంలో మట్కా ఆడుతున్నారని సమాచారం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. మట్కా ఆడుతున్నట్లు నిర్ధారించుకొని కేసు నమోదు చేశామన్నారు. సోమవారం వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.


కొండపైన నుంచి పోటీలను తిలకిస్తున్న జనం


ఎడ్ల పందేలను వీక్షిస్తున్న ప్రజలు

‘ఒంగోలు గిత్తల’ కోలాహలం

- ఉత్సాహంగా సాగుతున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఉత్సవ సేవా కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి, మేకలవారిపల్లి రెడ్ల సంఘం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం న్యూ కేటగిరీ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలను తిలకించటానికి వచ్చిన పశు పోషకులు మాట్లాడుతూ రైతులకు పశు సంపద అంటే ఎనలేని ఇష్టమని ఒంగోలు జాతి గిత్తల ఖ్యాతిని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎడ్ల పందేలు నిర్వహించటం అభినందనీయమని నిర్వాహకుల కృషిని కొనియాడారు. తిరునాళ్ల ప్రధానమైన రోజు కావడంతో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఎడ్ల ప్రాంగణం ఆవరణ పక్కనున్న కొండపైకి జనం రావడంతో కొండ ప్రాంతం కిక్కిరిసింది. న్యూ కేటగిరీ విభాగంలో ఆంధ్ర, తెలంగాణల నుంచి 11 జతల ఎడ్లు తలడ్డాయి. బండలాగు ప్రదర్శనలో నువ్వా, నేనా అన్న రీతిలో ఎడ్ల జతలు బండలాగాయి. న్యాయనిర్ణేతలుగా వెంకటరామిరెడ్డి, నారాయణస్వామి వ్యవహరించారు. ఎడ్ల పందేలను తిలకించటానికి, తిరునాళ్లకు వచ్చిన భక్తులకు సామాజిక అన్నదాన సత్రాల్లో భోజన వసతి కల్పించారు.


సైరా అంటూ బండల లాగుతున్న ఎడ్లు

సేద్యపు కుంటలతో భూగర్భ జలాల పెంపు

రాచర్ల: రైతువారి సేద్యపు కుంటలను రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ షేక్ ఖాశింబి అన్నారు. మండలంలోని రాచర్ల ఫారంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రైతువారి సేద్యపు నీటి కుంటను శనివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ పొలాల్లో రైతు వారి సేద్యపు కుంటలను ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలను పెంచుకోవాలని రైతులకు సూచించారు. మండలానికి 215 రైతు వారి సేద్యపు కుంటలు మంజూరు కాగా ప్రస్తుతం 140 నీటి కుంటల పనులు ప్రారంభించేందుకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి, ఈసీ నాగేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ, రైతులు దప్పిలి కాశిరెడ్డి, కూలీలు పాల్గొన్నారు.


నీటి కుంట పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ ఖాశింబి